కథ

# ఆఖరి కోరిక

డా॥ ఎన్.వి. రామరాజు

మాకు దసరా సెలవలిచ్చి పది రోజులైంది. ఇంటిముందే సుధతో వేపచెట్టు కింద గోళీలాడుకుంటున్నాను. సాములు, బంగారయ్యా మట్టోడొచ్చి లింగయ్యగారి చెరువు కట్టమీద నేరేడు గాయలు కోసుకొద్దామన్నా వెళ్ళబుద్ధి కాలేదు. తర్వాతొస్తా మీరెళ్ళండని చెప్పి వసారా దగ్గరగా పొగ వస్తున్నవైపు ఒకసారెళ్ళాను. తీపి, నేతి వాసనతో చుట్టు పక్కలంతా ఘుమఘుమలాడిపోతుంది. నా నోరు నీటితో నిండిపోతుంది. గోళీలాట మీద మనసు నిలవడం లేదు. నాకు పనుందని సుధని పంపేశాను.

కర్ర టకటకలాడిస్తూ వచ్చిన నత్తల సరవయ్య తాత వేపచెట్టు కింద నులకమంచం వాల్చి కూర్చుంటూ చుట్టముక్క చూపిస్తూ అగ్గి కోసం సైగ చేశాడు. లోనికెళ్ళదానికేమీ వంక దొరకని నాకు 'నిప్పు కణిక' వంకతో లోనికెళ్ళాను, స్వీటు ఏ దశలో వుందో చూదొచ్చన్న ఆశతో. అప్పుడే బాదంకాయ స్టీలు ప్లేటులో సర్దుతోంది మా అమ్మ పసుపు రంగులో వున్న స్వీటుని.

"గురవయ్య తాతొచ్చాడు నాన్న"అన్జెప్పి మండుతున్న చింతపుల్లను తీసుకెళ్ళాను.

తాత చుట్ట ముట్టించుకుని గుప్పుగుప్పున పొగ వదుల్తుంటే చూడ్డం నాకో సరదా!

గురవయ్య తాతది కూరేటి పాలెం. గొడ్ల వైద్యం చేసేవోడు. ఒక చేత్తో చుట్ట ఇంకో చేత్తో బాణాకర్ర పట్టుకొని ఠీవిగా నడుస్తుంటే ఎస్వీ రంగారావులా వుండేవాడు. ఎప్పుడూ నవ్వుతూ ఎదుటోళ్ళకి ఏదో చెప్పి నవ్వించేవాడు.


గురవయ్య తాత నాన్న, వాళ్ళ తాత కూడా గొడ్ల వైద్యం చేసే వాళ్ళంట! చుట్టుపక్కల ఊళ్ళే కాక, తెనాలిదాకా ఇటు పొన్నూరు నుంచి అటు రేపల్లెదాకా తాత అందరికీ తెల్సు. తాత జిల్లేపల్లి దాసుల్ల దగ్గర ఐదో తరగతి వరకు సంస్కృతం చదువుకున్నాడంట! ఎక్కాలు ఇరవైదాకా కిందనుంచి పైకి, పైనుంచి కిందకు గుక్క తిప్పుకోకుండా చెప్పేవాడు. ఆయన చెబుతుంటే మేమంతా గుడ్లెల్లబెట్టి వినేవాళ్లం. తాతని అందరు గురవయ్యగారనే పిలిచేవారు. ఎక్కడ గేదె ఈనలేకపోయినా, ఎవరిదైనా ఎద్దు కాలిరిగినా తాత వెళ్ళాల్సిందే! గూడవల్లిలో పశువుల ఆసుపత్రి వచ్చినా ఆ వూరి కమ్మవారంతా తాతనే పిలిచేవారు, ఏ గొడ్డుకు ఏ ఇబ్బంది వచ్చినా! తాత రామాయణం, భాగవతం చెబుతుంటే వింటానికి రెండు చెవులు చాలేవికావు.

ఎప్పుడైనా వైద్యం చేయదానికి మా వూరొస్తే మా ఇంటికి తప్పకుండా వచ్చేవాడు తాత. ఒకవేళ మా నాన్న ఇంట్లో లేకపోతే నక్కసూరి నారాయణ బాబాయి దగ్గరికెళ్ళేవాడు. వాళ్ళిద్దరూ కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి బళ్ళారి జైలులో ఆరు నెలలపైగా జైలుశిక్ష అనుభవించారట! చుట్టుపక్కల ఊర్ల జనం వీరిద్దర్ని పెద్ద హీరోల్లా చూసే వాళ్ళు.

మా నాన్న వచ్చి తాత ఎదురుగ్గా నవారు మంచం వాల్చి కూర్చుంటుంటే 'ఏంటి అల్లుడూ! ఈ పూట ఘుమఘుమలాడిపోతుంది వాతావరణం! చూడబోతె దంతాలకు పని తగిలేలా వుందే?" అంటూ చుట్టముక్కను ఆర్పేసి దూరంగా పడేశాడు.

"రవ్వ కేశరని" కొత్త రకం స్వీటు, భట్టిప్రోలు రెడ్డయ్య చెబితే చేయించా! తిని చెప్పాలి ఎలా వుందో" అంటుండగానే, మా అమ్మ రెండు ప్లేట్లలో స్వీటు తీసుకొచ్చింది. నేను ముక్కాలి పీట, ఇత్తడి చెంబుతో నీళ్ళు తీసుకొచ్చి ఇద్దరి మంచాల మధ్యన పెట్టి అమ్మ వెంట లోనికెళ్ళాను స్వీటు తింటానికి.

నేను బయటికొచ్చేసరికి తోకల లక్ష్మయ్య, సలగాల దుర్గయ్య,



పర్రె మునవయ్య, నక్క సూరినారాయణ బాబాయి తాతచుట్టూ కూర్చుని వున్నారు. తాత కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన సంగతులు చెబుతుండగా భట్టిప్రోలు పెంటు సాయిబు 'సేమియా' అనుకుంటూ వచ్చి చెట్టు కిందున్న తాటిమట్టి మీద కూర్చున్నాడు. ఆయన ఎదురుగా కాళ్ళదగ్గర తట్టలో వుంచిన సేమియా దేగిశా పెట్టుకున్నాడు. కండువాతో ముఖం తుడుచుకుని తాత చెప్పే మాటలు ఆలకించసాగాడు.

పొద్దుననంగ తినెల్లిన చద్దన్నం ఎటుపోయిందో కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. తొందరగా ఇంటికి జేరదామని కనగాల పెద్ద వంతెన మీదుగా వెళ్తుంటే పద్మావతి టాకీసు దగ్గరొక ఆడమనిషి నా కాళ్ళకడ్డం పడింది. చింపిరి తల, చిరిగిన రవిక, మాసిక లేసిన పాత చీర. ఆమె అవతారం చూసి అడుక్కునేదేమోననుకున్నా.

"ఇంతకీ రవ్వ కేసరి ఎట్టా వుందో చెప్పలేదు" అన్నాడు మా నాన్న తాత చెప్పే మాటల కడ్డు తగుల్తూ. తాత చెప్పడం కొంచెంసేపాగాడు.

"మీలో గంజెవరన్నా తాగారా?" అన్నాడు తేరిపారా చూస్తూ.

కొంచెంసేపు నిశ్శబ్దంగా వున్న తర్వాత అందరూ ఒక్కసారిగా ఘొల్లున నవ్వారు.

"నా మాట నవ్వులాటలా వుందా?" అన్నాడు సలగాల దుర్గయ్య వంక చూస్తూ.

"కాకపోతే మరేంది బాబాయ్! గంజిలో పుట్టి గంజిలో మెతుకులా పెరిగి ఆ గంజినే తులసి నీళ్ళలా తాగి చచ్చేటోల్లం. గంజి తాగారా మీరెప్పుడన్నా అంటే నవ్వకేం జేత్తారు?" అన్నాడు వేదాంతిలాగా.

అయితే నే తాగిన గంజి సంగతి చెబుతా! అలాంటిదెవరైనా తాగారో లేదో చెప్పండంటూ- చుట్ట ముట్టించి రెండు దమ్ములు లాగి గుప్పు గుప్పుమనిపించి చెప్పసాగాడు.

మూడేళ్ళ క్రితం కొత్త పాట సందుమాట! అపుడే దసరా పండగెళ్ళి వారం రోజులైంది. అద్దేపల్లి కరణంగారింట పుట్టిన కోడెదూడ ముందు కుడికాలు గిట్టకు దెబ్బ తగిలిందంట, బుర్ర తూము దగ్గర. నేనెల్లేసరికి మద్దుల లాలా లజపతిరాయ్‌గారి బావి పక్కనున్న గొడ్ల సావిట్లో వుందది. కాలు గిట్ట పూర్తిగా చీలిపోయింది. నేల మీద నిలపలేక కాలెత్తి నుంచుంది. దానికి పసర కట్టేసి నిలబెట్టేసరికి సూర్యుడు నెత్తిమీదకొచ్చాడు. పొద్దుననంగ తినెల్లిన చద్దన్నం ఎటుపోయిందో కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. తొందరగా ఇంటికి జేరదామని కనగాల పెద్ద వంతెన మీదుగా వెళ్తుంటే పద్మావతి టాకీసు దగ్గరొక ఆడమనిషి నా కాళ్ళకడ్డం పడింది. చింపిరి తల, చిరిగిన రవిక, మాసిక లేసిన పాతచీర. ఆమె అవతారం చూసి అడుక్కునేదేమోననుకున్నా.

"ఏం కావాలమ్మా?" అనడిగాను.

"రెండ్రోజుల్నుంచి తన గేదె ఈనలేక బాధపడుతుందని... పిలిత్తే వత్తావో రావోనని పిలవలేదని... ఇంటికీదారెంట ఎల్తావు కదాని కాచుక్కూర్చున్నానయ్యా" నువ్వే ఈ మూగజీవాన్ని కాపాడి దూడని ఒడ్డున పడెయ్యాలయ్యా" అంటూ ఏడుస్తూ నా కాళ్ళు చుట్టేసిందా ముసలమ్మ.

తాటాకు గుడిసె, దానిమీద దట్టంగా పాకిన సొరపాదు, ఆకుల మధ్యలోంచి అక్కడక్కడ కాయలు కన్పిస్తున్నాయి. గుడిసె ముందున్న కట్టు గొయ్యికి కట్టేసిన కంత్రిమాళీ గేదె బొంగరంలా తిరుగుతుంది. తొలిచూలులా వుంది. ఎప్పట్నుంచి తిరుగుతుందో అక్కడంతా గుంటలు పడి రొచ్చు రొచ్చుగా తయారైంది.

దూడ అడ్డం తిరిగింది. దాన్ని బయటికి లాగి మాయ తీసి శుభ్రం చెయ్యాలంటే గంట పైగా పడుతుంది. కడుపులో ఎలుకలు గొడవ చేస్తున్నాయి. ఇంటిదాకా వెళ్ళి ఓ ముద్ద ఎంగిలి పడొస్తానమ్మా" అని చెప్పాను.

"నువ్వెళ్ళిపోతే నోరులేని జీవం పాణాలు అన్నాయంగా గాల్లో కలిసిపోతాయయ్యా, రెండుసార్లు కట్టి ఈసేసిందయ్యా. మూడో కట్టు నిలబడింది. నాకున్న ఆధారం అదొక్కటే. పాలిడిచిన దగ్గర్నుంచి కన్నబిడ్డలా సాకానయ్యా. దేవుడిలా వచ్చావు. నువ్వే కాపాడాలంటూ గోల గోలగా ఏడుస్తుంది.

ఆడమనిషిని చూస్తే జాలేసింది. చేతికర్ర గుడిసె తడిక్కానించి, పంచె పైకి ఎగ్గట్టి పనిలో దిగి దూడను లాగి మాయను తీసేసరికి గంట పట్టింది. పెయ్యి దూడని చూసేసరికి ఆవిడ ఆనందం అంతా ఇంతా కాదు. నేను దూడని తీసినంతసేపు నా కాళ్ళకడ్డం పడుతూ అక్కడే తిరుగుతుంది. పెయ్యి దూడని కోక చెంగుతో తుడుస్తూ దాని కాలిగోళ్ళు గిల్లుతుంది. నేను కాలువలో కాళ్ళు, చేతులు శుభ్రం చేసు కొచ్చేసరికి పచ్చగడ్డి మేస్తోంది గేదె. దూడకి పాలు తాగిస్తుందావిడ. నాకు ఆకలి నకనకలాడుతుంది. గుడిసె ముందున్న నక్కేరు చెట్టు కిందున్న కూసం విరిగిన కుక్కిమంచం మీద ఒక పక్క ఒరిగి కూర్చున్నా కాళ్ళు, చేతులు కండువాతో తుడుచుకుంటూ. ఆకలితో నీరసంగా వుంది. ఇంటికెళ్ళే ఓపిక కూడా లేదు. నడుం వాల్చడానికి అనుకూలంగా లేదా మంచం. కొంతసేపటికి ఆవిడ గుడిసె వెనక్కెళ్ళి నవనవలాడే లేత సొరకాయను కోసుకొచ్చింది నాకివ్వడానికన్నట్టు. నాకు చాలా ఆకలిగా వుంది. ఇపుడివేమీ అక్కర లేదు, తింటానికేమన్న వుంటే పెట్టు" అన్నాను. "అయ్యా! మీ బోటోళ్ళు మా ఇళ్లల్లో తింటారా?" అంది అనుమానంగా.

"ఎందుకు తినం? ఏదుంటే అది పెట్టు" అన్నాను. "నిన్నట్నించి గేదె నెప్పులు పడుతుంటే దాని బాధ సూడలేక దానిదగ్గరే వున్నానయ్యా! ఏమీ వండుకోలేదంటూ, కాలువగట్టు మీదున్న ఎండిపోయిన పిచ్చి మిరపకాయ మొక్కల్ని పీక్కొచ్చింది. ఒక పక్క పొంతకుండ దానికానుకుని మట్టితో అలికిన పొయ్యిదిమ్మలోని బూడిద బయటికి లాగి మట్టి సట్టిలో నూకలు, నీళ్ళు పోసి మంట రాజేసింది.

ఎండిన పిచ్చి మిరప మొక్కలు సురసుర మండుతుంటే నా కడుపులో పేగులు అంతకన్నా పెద్దగా అరుస్తున్నాయి. దాహం అవుతుంది, తాగుదామన్నా ఆ గుడిసెలో మంచినీళ్ళ కుండ కూడా వున్నట్టు లేదు. అన్నం కుతకుత ఉడకసాగింది. సట్టిమీదున్న మట్టి మూకుడు ఆవిరికి ఎగిరెగిరి పడుతుంది. మధ్యమధ్యలో మూకుడిని తీసి తాటిమట్ట తెడ్డుతో అన్నాన్ని కలతిప్పుతుందావిడ. కొంతసేపటికి గంజి అన్నాన్ని సత్తుగిన్నెలో పోసి ఉప్పు కల్లేసి నా చేతికిచ్చింది. పై కండువాతో దాని అంచులు పట్టుకుని ఆత్రంగా ఒక్క గుటకేసేసరికి నాలుక చురుక్కుమంది. అట్టాగే పట్టుకుని చల్లారేదాకా ఆగి ఆత్రంగా తాగడం మొదలెట్టా! గిన్నె ఖాళీ అయిపోగానే మట్టి సట్టలో మిగిలిపోయిన గంజి అన్నం తెచ్చి పోసింది. అది అమృతం తాగినట్టే వుంది. కానీ





గంజి అన్నం తిన్నట్టు లేదు. నా ఆకలి తీరేసరికి మట్టినట్ట ఖాళీ అయిపోయింది. అంత రుచిగల అన్నం నా జీవితంలో తినలేదు. దాని రుచి ముందు తిరుపతి లడ్డు గానీ, హైదరాబాదు బిర్యానీ గానీ, మద్రాసు సాంబారైనా, చివరికి ఈ సెంటు సాయిబు సేమియా పాయసం కూడా బలాదూరే! ఇంక ఈ రవ్వ కేశరెంత?! దేవతల దగ్గరుండే అమృతం కూడా దిగదుడుపే!" అన్నాడు ఆ గంజి రుచి గుర్తు చేసుకుంటూ! ఆ ముసలమ్మకు... తప్పు తప్పు. ఆ... అన్నపూర్ణమ్మకు మన సారా దణ్ణం పెట్టుకొని ఇంటికి చేరేసరికి దీపాల వేళయింది".

అందరూ నిశ్శబ్దంగా వినసాగారు. వేపచెట్టుమీద కాకిమాత్రం అప్పుడప్పుడు అరుస్తుంది, ఏమీ తోచక! గాలి కదలడం లేదు. ఉక్కపోతగా వుంది వాతావరణం. పర్రె బసవయ్య పై కండువాతో ముఖం తుడుచుకుంటూ "నిద్ర సుఖమెరుగదు, ఆకలి రుచెరగదని" మాంచి ఆకలిమీదున్నావుగా అందుకే ఆవిడ పోసిన గంజన్నం అంత రుచిగా వుందిలే మామా!" అన్నాడు.

"కాదల్లుడూ, అంతకన్నా ఆకలిగా వున్న రోజులు నాకెన్నో! ఒక్కసారి ఇల్లొదిలి పనిమీద బయలుదేరితే రెండు మూడు రోజులు పట్టేది. కోమట్లు, బ్రాహ్మలు, రెడ్లు, నాయుడ్లు, కమ్మోరు, సాయిబుల ఇళ్లే కాక, మిగిలిన కులపోళ్ళందరూ ఇళ్లల్లో అన్నం పెట్టేవారు నాకు. కానీ అంత రుచి గల అన్నం ఇంతవరకు తిన్లేదు" అన్నాడు చుట్ట నుసి రాలుస్తూ. ఆ రుచి ఆ పిచ్చి మిరప మొక్కల మంట వల్ల వచ్చిందో, ఆ మట్టి సట్టివల్నో తెలీదు కానీ నాకైతే ఆ గంజన్నం చనిపోయేలోగా ఒక్కసారన్నా తినాలని కోరిక",అన్నాడు.

"కనగాల దారెంట ఎన్ని సార్లెల్లలేదు. ఆవిడ్నే అడగపోయావా! ఆ గంజన్నం వండి పెట్టమని" అన్నాడు నక్క సూరినారాయణ బాబాయి.

అడుగుదామనుకున్నా చాలాసార్లు. "ముసిల్దాన్ని అన్నం కూర పెట్టకుండా గంజి పోశానని ఎకసెక్కం సేత్తున్నాడీ పెద్దమనిషనుకుంటుందేమోనని" ఆ అన్నపూర్ణమ్మను బాధపెట్టటం ఇష్టం లేక అడగలేదురా సూరీ!" అన్నాడు.

కుడిచేత్తో జర్మన్ సిల్వర్ టిఫిను, చంకలో సత్తుగిన్నెతో గేటు దగ్గరకొచ్చింది ముసలమ్మ... నేను ఎదురెళ్ళి చేతిలో టిఫిను తీసుకుని తాతదగ్గరకొచ్చాను పరుగులాంటి నడకతో. టిఫిను మూత తీసి "నీ అమృతం వచ్చింది లే తాతా!" అన్నాను ఉత్సాహంగా. నా వంక చూస్తూ నవ్వుతున్నట్టే ఉన్నాయి తాత చూపులు. మాటా, పలుకు లేదు.

మాకు సంక్రాంతి సెలవలప్పుడు గురవయ్య తాతకు జబ్బుచేసి కనగాల గవర్నమెంటు ఆసుపత్రిల చేరాడు. నత్తగుల్ల గుచ్చుకుని కుడికాలు బొటన వేలు సెప్టిక్ అయ్యిందంట! తాతకు షుగరుందని ఆసుపత్రిలో జేరిన తర్వాత తెలిసిందంట! పుండు మానడానికి కొంత టైం పడుతుందని డాక్టరు చెప్పారు.

తాతకు పచ్చి చేపలంటే చాలా ఇష్టం. పైడిమ్మ చెరువులో పట్టిన బొచ్చెలు గడ్డం సుబ్బయ్య తెస్తే గుజ్జుగా వండి నా క్యారేజీలో పై రెండరల్లో కూర, కిందరలో అన్నం పెట్టించింది అమ్మ తాతకిచ్చి రమ్మని.

నేను ఆసుపత్రికి చేరేసరికి తాత చాలా హుషారుగా వున్నాడు.

"తాతా! నీకు చాలా ఇష్టమైంది తెచ్చా ఏంటో చెప్పుకో!" అంటూ క్యారేజీని చూపించా.

"నాకంతకన్న ఇష్టమైందింకో గంటలో రాబోతుంది" ఏంటో కనుక్కో అన్నాడు తాత నవ్వుతూ.

"ముందు నేనేం తెచ్చానో చెప్పు తాతా!" అన్నాను.

"నేను దేనికోసం ఎదురు చూస్తున్నానో కనుక్కో!" అన్నాడు నా వంక చూస్తూ తాత.

తెలీదంటూ తలూపాను.

"అటు చూడంటూ" పక్క బెడ్డు మీదున్న పదేళ్ళ బాబుని చూపించాడు.

నాకేం అర్థం కాలేదు.

"ఆ బాబెవరనుకున్నావ్? నాకు అమృతంలాంటి గంజన్నం పెట్టిన ముసలావిడ గురించి చెప్పేవాణ్ణే. ఆవిడ మనవడు" మలేరియా జ్వరంతో నిన్నే జేరాడు" అన్నాడు తాత.

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?"

నాకేం అర్థం కాక ఆయనవంకే చూశాను.

"ఉంది మనవడా! పొద్దున్నే మనవణ్ణి చూడ్డానికొచ్చిందా ముసలావిడ... నన్ను గుర్తు పట్టింది. నా జబ్బు తెలుసుకుని బాధపడింది కూడా.

"నెల నుండి ఆసుపత్రి మందుల్తో నోరు చవి చచ్చిపోయిందమ్మా! మూడేళ్ళ కిందట నువ్వు నాకు వండిపెట్టిన వేడి వేడి గంజన్నం తినాలనుంది. నువ్వేమీ అనుకోకపోతే ఇప్పుడు తెచ్చి పెడతావా అమ్మా!" అనడిగాను ఆశగా.

"అయ్యో! దానికింతగా అడగాలా అయ్యా! అదెంత బాగ్గెం... అన్నపేలకు తీసుకొత్తానుండంటూ" వెళ్ళింది. "నువ్వా రుచి చూద్దువుగాని వుండు మనవడా" అన్నాడు నన్ను ఊరిస్తున్నట్టు.

"ముందుగా నే తెచ్చిన చేపలకూర తిను తాత" అన్నాను. తాత వినలేదు.

డాక్టరు రౌండ్స్‌కి వచ్చి "ఇన్సులిన్ సూదివ్వాలి క్యారేజీ వచ్చిందా గురవయ్యగారు" అన్నారు.

కొంచెంసేపట్లో అమృతం రుచి చూడబోతున్న. సూదుల్తో పనేంటి డాక్టరు" అన్నాడు తాత నవ్వుతూ. డాక్టరు నవ్వుతూ వెళ్ళిపోయారు పక్క వార్డుకి.

"గేటుదాకా పోయి చూసిరా ఆ అమ్మ వస్తుందో లేదో" అని నన్ను తొందరపెట్టాడు తాత. "గేటుదాకా వచ్చింది ఇక్కడికి రాదా తాతా... నీ ఆత్రం కాకపోతే అన్నాను" తాతతో.

మేమందరం ముసలమ్మ కోసమే ఎదురు చూస్తున్నాం. కుడిచేత్తో జర్మన్ సిల్వర్ టిఫిను, చంకలో సత్తుగిన్నెతో గేటు దగ్గరకొచ్చింది ముసలమ్మ... నేను ఎదురెళ్ళి చేతిలో టిఫిను తీసుకుని తాతదగ్గరకొచ్చాను పరుగులాంటి నడకతో. టిఫిను మూత తీసి "నీ అమృతం వచ్చింది లే తాతా!" అన్నాను ఉత్సాహంగా. నావంక చూస్తూ నవ్వుతున్నట్టే ఉన్నాయి తాత చూపులు. మాటా, పలుకు లేదు. "డాక్టరుగారు! మా తాత మాట్లాడటం లేదని" పెద్దగా అరిచాను. డాక్టర్ వెంటనే వచ్చి తాత చేయి పట్టుకుని నాడి చూసి ఛాతిమీద మర్దన చేయసాగారు. నర్సమ్మ ఏదో ఇంజెక్షనిచ్చింది. తాతలో చలనం లేదు. నాకెందుకో భయంగావుంది. కంపౌండర్ వచ్చి ముక్కులో ఆక్సిజన్ గొట్టం పెట్టాడు. డాక్టర్ మరలా నాడి చూసి పెదవి విరిచి బాధగా వెళ్ళిపోయాడు. నా చేతిలో టిఫిను బాక్సు జారిపోయింది.